క్లుప్తంగా

గర్భిణులకు వైద్య పరీక్షలు



ఎల్లారెడ్డి: మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ శరత్ సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి గర్భిణీ పీహెచ్‌సీలలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అనిత, శారద తదితరులున్నారు.

సకాలంలో ఓటర్ స్లిప్పులను పంపిణీ చేయాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాలలో బీఎల్‌వోలు ఓటర్ స్లిప్పుల పంపిణీ సకాలంలో పూర్తి చేయాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు సూచించారు. బెజుగంచెరువుతండా జీపీ పరిధిలోని ఎర్రకుంటతండాలో సోమవారం ఓటర్ స్లిప్పుల పంపిణీని ఆయన పరిశీలించారు.

గిర్నితండా జీపీలో..



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని గిర్నితండా గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి శిరీష ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ స్లిప్పులను అందజేశారు. ఈ నెల 30న పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కృష్ణాజీవాడిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కృష్ణాజీవాడిలో సోమవారం ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. బూత్ లెవల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూ.25వేల విరాళం



భిక్కనూరు: దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్దరామేశ్వరాలయం అభివృద్ధికి నిజామాబాద్‌కు చెందిన బచ్చు సిద్ధప్రసాద్–సునీత దంపతులు రూ.25వేలను శనివారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో దాత కుటుంబీకులను సన్మానించారు. స్వామివారి చిత్రపటాన్ని ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో పూజారి రాజేశ్వర శర్మ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి సోదరుడి పూజలు



రామారెడ్డి(ఎల్లారెడ్డి): ఎన్నికల ప్రచారంలో భాగంగా పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి రామారెడ్డి మండలంలోని మద్దికుంట గ్రామంలో వెలసిన బుగ్గరామలింగేశ్వరుడి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కామారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న రేవంత్‌రెడ్డి మద్దతుగా ఆయన ప్రచారం చేస్తున్న విషయం తెల్సిందే.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

రామారెడ్డి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఇసన్నపల్లి(రామారెడ్డి) శ్రీకాలభైరవుడి జన్మదిన ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఆలయ ఈవో ప్రభుగుప్తా ఆవిష్కరించారు. వచ్చే నెల 2 నుంచి కాలభైరవుడి జన్మదిన ఉత్సవాలు జరుగుతాయని, 6న నిర్వహించే అగ్ని గుండాల(దక్షయజ్ఞం)తో ముగుస్తాయని తెలిపారు. అర్చకులు శ్రీనివాసశర్మ, వంశీకృష్ణ శర్మ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

ఎల్లారెడ్డి: పోసానిపల్లి గ్రామానికి చెందిన ఎరుకల దుర్గయ్యకు ఎస్సై గణేష్ సోమవారం సెల్‌ఫోన్‌ను అందించారు. దుర్గయ్య ఫోన్ పోగొట్టుకోవడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడంతో దాని ఆధారంగా ఫోన్ ఆచూకీని కనుక్కుని బాధితుడికి ఫోన్‌ను అందించినట్లు ఎస్సై తెలిపారు.

దుప్పట్ల పంపిణీ



పెద్దకొడప్‌గల్(జుక్కల్): తల్లి జ్ఞాపకార్థం కుమారుడు విద్యార్థులకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. సోమవారం చావుని తండా ఎస్టీ బాలుర హాస్టల్ విద్యార్థులకు, పెద్దకొడప్‌గల్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులకు కాటేపల్లి గ్రామానికి చెందిన పానుగంటి హనుమాండ్లు తన తల్లి పానుగంటి పెంటమ్మ జ్ఞాపకార్థం దుప్పట్లు పంపిణీ చేశారు. ఎంఈవో దేవి సింగ్, హెచ్‌ఎం విఠల్, తదితరులు పాల్గొన్నారు.

నేను జుక్కల్ బిడ్డను

- ఇక్కడే పుట్టిన.. ఇక్కడే పెరిగిన
- ప్రతిపక్షాల అభ్యర్థులు వలసవాదులు
- జుక్కల్ బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే హన్మంత్ సింధే



చిల్లర్గిలో ప్రచారానికి వచ్చిన హన్మంత్ సింధేకు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు



బిచ్కుందలో ఎమ్మెల్యే సమక్షంలో చేరిన ప్రజలు

పిట్లం(జుక్కల్): కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమని, ప్రతిపక్ష పార్టీలకు అభ్యర్థులు దొరకడం లేదని, ఇతర జిల్లాలకు చెందిన అభ్యర్థులను జుక్కల్‌లో పోటీచేయిస్తున్నారు..నేను ఇక్కడే పుట్టిన ఇక్కడే పెరిగిన.. రేపు చనిపోయినా నా చితిని కూడ ఇక్కడే పెడతారని జుక్కల్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. ఆయన సోమవారం సిద్దాపూర్, చిల్లర్గి, బ్రాహ్మణపల్లి, కిష్టాపూర్, పోతురెడ్డిపల్లి, నాగంపల్లి, అన్నారం, హస్నపూర్ గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఘనంగా స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరినీ ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సింధే మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని చెప్పారు. రైతులకు సమృద్ధిగా సాగునీరు అందించడానికి నాగమడుగు ఎత్తిపోతల పథకం ప్రారంభించామని తెలిపారు. ఈ పథకం పూర్తయితే వర్షాలు లేకపోయినా ఎత్తిపోతల ద్వార పిట్లంతో పాటు మరో మూడు మండలాలకు సాగునీరు అందించడానికి వీలవుతుందని తెలిపారు. దీనికి రూ. 476 కోట్లు మంజూరయ్యాయని పనులు సైతం కొనసాగుతున్నాయి అని పేర్కొన్నారు. గెలిచిన వెంటనే నియోజకవర్గంలో మిగిలి ఉన్న పనులను కూడా చేసుకుందామని అన్నారు. బీఆర్ఎస్ ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. పలువురు ఎమ్మెల్యే హన్మంత్ షిండే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాసరి రమేష్, ఎంపీపీ కవిత, జెటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్‌లో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు

బీఆర్ఎస్‌లో చేరిక

బిచ్కుంద/మద్నూర్(జుక్కల్): బిచ్కుంద, మద్నూర్ మండలాలకు చెందిన పలువురు ఎమ్మెల్యే హన్మంత్ సింధే సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన, బీఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మద్నూర్ మాజీ సర్పంచ్ వట్నాల్‌వార్ నర్సుబాయి, మాజీ ఉప సర్పంచ్ సాయన్న, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు రమేశ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. బిచ్కుంద ఎంపీపీ అశోక్, నాయకులు నాల్చర్‌రాజు, శేక్ హుస్సేన్, కలీం పటేల్, వెంకట్‌రావు పాల్గొన్నారు.

సౌత్‌క్యాంపస్‌ను యూనివర్సిటీగా మార్చాలి



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌ను యూనివర్సిటీగా మార్చాలని విద్యార్థి జేఏసీ పూర్వ అధ్యక్షుడు సత్యం డిమాండ్ చేశారు. ఆయన సోమవారం సౌత్‌క్యాంపస్‌లో విద్యార్థులతో మాట్లాడుతూ.. కామారెడి ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చాలని నాలుగు జిల్లాల కూడలిగా ఉన్న సౌత్ క్యాంపస్‌ను యూనివర్సిటీగా మార్చి తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన కానిస్టేబుల్ కిష్టయ్య పేరు పెట్టాలన్నారు. సమావేశంలో విద్యార్థి నేతలు వంశీ, రవి, సురేష్, రమేష్, రమ్య పాల్గొన్నారు.

ప్రత్యర్థుల తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు



రామక్కపల్లిలో వృద్ధురాలిని ఓటు అడుగుతున్న మదన్‌మోహన్ రావు



ప్రచారం చేస్తున్న మదన్‌మోహన్ సోదరి శోభ

- ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ రావు



సర్పంచ్‌లను పార్టీలోకి ఆహ్వానిస్తూ..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాను ఎమ్మెల్యేగా గెలిస్తే విదేశాలకు వెళతానని ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని, తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత స్థానికంగా ఇక్కడే ఉండి నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తానని ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ రావు పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని అచ్చాయపల్లి, రామక్కపల్లి, జలాల్‌పూర్, చిన్నఆత్మకూర్, పెద్దఆత్మకూర్, మాసాన్‌పల్లి, మాటూర్ గ్రామాలలో సోమవారం ఆయన తన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీంతోపాటు మండలకేంద్రం గోపాల్‌పేటలోని వారాంతపుసంతలో ఆయన రోడ్‌షోలో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా కష్టకాలంలో ఆక్సిజన్‌ను సరఫరా చేసి ప్రజల ప్రాణాలను కాపాడానన్నారు. తాను రాజకీయాలలోకి వచ్చింది పనిచేయడానికి తప్ప పైసలు సంపాదించడానికి కాదని చెప్పారు. తనకు వచ్చే జీతం డబ్బులతో గరీబోళ్లకు ఇళ్లు కట్టిస్తానని అన్నారు. నన్ను కొనే నాయకుడు ఇంకా పుట్టలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత ఐదేళ్ల కాలంలో ఎక్కడైనా రూపాయి కమీషన్ తీసుకున్నట్లు నిరూపించినా తన పదవికి రాజీనామా చేస్తానని బాండ్ పేపర్ రాసిచ్చానని గుర్తు చేశారు. గతంలో వైఎస్సార్ 26 లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిపెట్టారని ఆయన గుర్తుచేశారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన ధరణి వల్ల 26 లక్షల ఎకరాల భూములకు సంబంధించిన రైతులు పట్టాలు అందక రోడ్డున పడ్డారని మండిపడ్డారు. ఎంపీపీ రాజ్‌దాస్, మాజీ వైస్ ఎంపీపీ మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్యారంటీలతోనే ప్రజలకు మేలు

లింగంపేట(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు, మేనిఫెస్టో వల్లనే తెలంగాణ ప్రజలకు మేలు జరుగుతుందని మదన్‌మోహన్‌రావు సోదరి శోభ అన్నారు. సోమవారం ఆమె లింగంపేట మండల కేంద్రంలో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల గురించి వివరించారు. కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి రఫీయోద్దీన్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో ముగ్గురు సర్పంచ్‌ల చేరిక

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అచ్చాయపల్లి, బంజర గ్రామాల సర్పంచ్‌లు కొంపల్లి శైలజ, మాలోత్ అరుణతోపాటు లింగంపల్లికలాన్ ఇన్‌చార్జి సర్పంచ్ కోనేరుగారి కుమార్ సోమవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. వీరితో పాటు నాగిరెడ్డిపేట మాజీ వైస్ ఎంపీపీ మధుకర్ కాంగ్రెస్లో చేరారు. ఈ సందర్భంగా వారికి మదన్ మోహన్‌రావు కండువాలను కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని తిమ్మోజివాడి గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు సోమవారం మదన్ మోహన్‌రావు సమక్షంలో పార్టీలో చేరారు. నేతలు పొన్న సాయిలు, రాజశేఖర్, అనిల్, తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.

గాంధారి(ఎల్లారెడ్డి): మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మదన్‌మోహన్ సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధారి సింగిల్ విండో డైరెక్టర్ తాడ్వాయి సంతోష్, నాయకులు బెజుగం సంతోష్, మొండిసడక్ గ్రామానికి చెందిన కృష్ణాగౌడ్ తదితరులు చేరిన వారిలో ఉన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి



కామారెడ్డి టౌన్: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ చైర్మన్ డాక్టర్ కె.వాసుదేవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిప్ప దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. దివ్యాంగులకు పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని, దివ్యాంగ బంధు పథకం, జీవిత బీమా రూ.10లక్షలు అమలు చేయాలన్నారు. దివ్యాంగ నాయకులు పంగ ఈశ్వర్, బాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధంతో సమానం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఓటు వజ్రాయుధంతో సమానమని ఐఎస్ఆర్‌డీ(ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్)స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి అమృత్‌రాజేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ధైర్యంగా ఓటును వినియోగించుకోవాలన్నారు. అన్ని విధాలా మనకు సేవ చేసే నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ అజ్మల్ ఖాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు నీరాజనాలు పలుకుతున్నారు

- మాజీ ఎంపీ సురేష్ షెట్కార్



మద్నూర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎంపీ షెట్కార్

మద్నూర్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు అడుగడుగునా నీరజనాలు పలుకుతున్నారని జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ కేవలం అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టిందని ఎన్నికల హామీలను తుంగలో తొక్కిందని ఆరోపించారు. తెలంగాణలో రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఎక్కడ ఇస్తున్నారని ప్రశ్నించారు. కుటుంబ పాలనతోనే కేసీఆర్ కుటుంబం మాత్రమే అభివృద్ధి చెందిందని దుయ్యబట్టారు. జుక్కల్ కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీకాంతరావుకు ఓటు వేయాలని కోరారు. రాష్ట్ర ఎన్నికల పర్యవేక్షకుడు మెయప్పన్, అబ్జర్వర్ వీరమణి, నాయకులు కాసుల బాల్‌రాజ్, గిరిజ షెట్కార్, తదితరులున్నారు.

రాజకీయాలకు కొత్తరూపం తీసుకురావాలి



బీబీపేటలో మాట్లాడుతున్న వేణుగోపాల్‌రెడ్డి



దోమకొండలో కాంగ్రెస్ శ్రేణుల ర్యాలీ

- పారిశ్రామిక వేత్త తిమ్మయ్యగారి వేణుగోపాల్‌రెడ్డి

బీబీపేట/భిక్కనూరు/దోమకొండ: నీచమైన రాజకీయాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులకు స్వస్తి పలకాలని, రాజకీయాలకు ఒక కొత్త రూపం తీసుకురావాలని జనగామ గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త తిమ్మయ్యగారి వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భిక్కనూరు మండలం బస్వాపూర్ నుంచి దోమకొండ మీదుగా సుమారు 400 ద్విచక్ర వాహనాలు, 100 పైగా కార్లతో ర్యాలీ నిర్వహించారు. బీబీపేట ప్రధాన చౌరస్తాలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుందామని, కామారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని అన్నారు. మాజీ ఎమ్మెల్యే అనిల్, రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, జనగామ సర్పంచ్ పాత రాజు, ఇంద్రకరణ్‌రెడ్డి, భూమాగౌడ్ పాల్గొన్నారు.

బీబీపేట ఉపసర్పంచ్ కాంగ్రెస్‌లో చేరిక

బీబీపేట: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ ఉపసర్పంచ్ ఉప్పల సాయినాథ్ సోమవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ బెంగుళూరు ఎమ్మెల్యే, ఏఐసీసీ ఇన్‌చార్జి రిజ్వాన్, రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డిలు సాయినాథ్‌తో పాటు బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాచం నరేందర్‌కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

గడప గడపకు కాంగ్రెస్

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ మహిళ విభాగం మండలాధ్యక్షురాలు బల్యాల రేఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న బీబీపేట ఉపసర్పంచ్



భిక్కనూరులో ప్రచారం చేస్తున్న మహిళా కాంగ్రెస్ నేత బల్యాల రేఖ

ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ



జిల్లా కేంద్రంలో రేవంత్‌రెడ్డి ఫొటోకు క్షీరాభిషేకం

కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు జీవన భృతి ప్రకటించడంతో కామారెడ్డి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలో ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. నిజాంసాగర్ చౌరస్తాలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్ అలీల ఫోటోలకు క్షీరాభిషేకం చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు, కార్మికులు పాల్గొన్నారు.

స్థానికంగా ఉండి అభివృద్ధి చేస్తున్నా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల



పార్టీలో చేరుతున్న కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు

- ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్

రాజంపేట: ఎల్లారెడ్డి నియోజకవర్గంలో స్థానికంగా ఉంటూ అభివృద్ధి చేస్తున్నానని, తనను మరోసారి ఆశీర్వదించాలని ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్, ఓటర్లను విజ్ఞప్తి చేశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని రాజంపేట మండలంలో సిద్దాపూర్, నడిమి తండా, గుండారం, ఎల్లారెడ్డిపల్లి, ఎల్లారెడ్డిపల్లి తండా, షేర్ శంకర్ తండా, ఏమన్నా కొండాపూర్, ఆర్గొండ, బసవపల్లి గ్రామాల్లో సోమవారం ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని వ్యాఖ్యానించారు. ఓటర్లు కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలన్నారు. నాయకులు కష్టమూర్తి, నీరడి శంకర్, ఎంపీటీసీలు, గ్రామాల సర్పంచులు లక్ష్మణ్, బీరయ్య,స్వాతి, భాస్కర్, లక్ష్మి, శ్రీజ రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన అమర్లబండ యువకులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అమర్లబండ గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు కార్యకర్తలు సోమవారం సర్పంచ్ లత రాజేశ్వర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు యువకులు పేర్కొన్నారు.

'గిరిజనుల అభ్యున్నతికి కేసీఆర్ కృషి'



దఫేదార్ రాజు సమక్షంలో చేరిన గిరిజనులు

నిజాంసాగర్(జుక్కల్): సీఎం కేసీఆర్ పాలనలో గిరిజన తండాలు గ్రామ పంచాయతీలుగా రూపుదిద్దుకున్నాయని జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు అన్నారు. సోమవారం మహమ్మద్‌నగర్ మండలంలోని దూప్‌సింగ్‌తండా, గిర్నితండా గ్రామపంచాయతీల్లో బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధేకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా తాండాలకు చెందిన గిరిజన యువకులు, మహిళలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నాయకులు సాదుల సత్యనారాయణ, గంగారెడ్డి, వాజిద్‌అలీ, చందర్ రాథోడ్, కడావత్ శ్రీనివాస్, రెడ్యానాయక్, నారాయణ తదితరులు ఉన్నారు.

విద్యార్థి జీవితాన్ని మార్చేది చదువే



ప్రతినిధులను సన్మానిస్తున్న పోతాయిపల్లిగ్రామస్తులు

లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యార్థి జీవితాన్ని మార్చేది చదువు మాత్రమేనని బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ వ్యవస్థాపకుడు చాంద్‌పాష అన్నారు. సోమవారం ఆయన పోతాయిపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పేద విద్యార్థులు తమ చదువును కొనసాగించడానికి బిగ్ హెల్ప్ సంస్థ అండగా ఉండి ఆర్థికంగా ఆదుకుంటుందన్నారు. ఇప్పటి వరకు 310 మంది విద్యార్థులను పలు రకాలుగా ఆదుకుంటూ అండగా నిలిచినట్లు వెల్లడించారు. ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి ఉన్న స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. సంస్థ ప్రతినిధులను గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ లక్ష్మీనారాయణ, సంద బాలయ్య, ప్రధానోపాధ్యాయుడు అంజల్‌రెడ్డి, మేనేజింగ్ ట్రస్ట్ సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధిగ్రస్తులను గుర్తించాలి



మాట్లాడుతున్న డాక్టర్ శిరీష



హాజరైన వైద్యులు, అధికారులు

బాన్సువాడ రూరల్: బీపీ, షుగర్, క్యాన్సర్ తదితర అసంక్రమిత వ్యాధిగ్రస్తులను క్షేత్రస్థాయిలో గుర్తించి వారికి ఈ–సంజీవని ద్వారా వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శిరీష సూచించారు. సోమవారం బాన్సువాడలోని మాతాశిశు ఆస్పత్రిలో బాన్సువాడ డివిజన్‌లోని మెడికల్ ఆఫీసర్, వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. అసంక్రమిత వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి ల్యాబ్ పరీక్షల నిర్ధారణ అనంతరం వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, మానసిక రోగులకు సకాలంలో సేవలు అందేలా చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి సబ్‌సెంటర్ నుంచి కనీసం 15మంది చికిత్స పొందేలా చూడాలన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న గజ్యానాయక్ తండా వాసులు

మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండాకు చెందిన సుమారు 200 మంది పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. తండావాసులకు కాంగ్రెస్ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఇందిరమ్మ రాజ్యం రావాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కొండల్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, నాయకులు శ్యామ్ సుందర్ రెడ్డి, సదార్ నాయక్, బన్సీలాల్, శంకర్ నాయక్ ఉన్నారు.